# మీరేం పోగొట్టుకున్నారు

"ఇక్కడ నా బాగ్ ఉండాలండీ."

ఆ ముప్ఫయి ఏళ్ళ యువకుడి కంఠం ఒణికింది. అతని కళ్ళు ఆదుర్దాతో చుట్టూ తిరగసాగాయి.

"జిప్‌బాగ్ కదండీ? కొత్తది. ఎర్రగా ఉంటుంది, ముచ్చటైన డిజైన్‌కూడా ఉంది." ఒక కంఠం అతనిలో ఆశల్ని గుప్పుమనిపించింది.

"ఆఁ....ఆఁ....అదేనండీ! చూశారా మీరు?"

"చూశానండీ లేకపోతే ఎలా వర్ణిస్తాను?"

ఆ యువకుడి ముఖం వికసించింది.

"ఎక్కడుందండీ?"

"ఎక్కడుందని చెప్పేది....ఎవరో తీసుకుపోతుంటే చూశాను. మీదని నాకేం తెలుసు?"

ఆ యువకుడికి ముచ్చెమటలు పోశాయి.

"ఇంకేం రైలు కదలగానే ఎవరో కొట్టేసి దిగిపోయి ఉంటాడు. గొలుసు లాగండి" పక్కనే ఉన్న యింకోవ్యక్తి ఉచిత సలహా యిచ్చాడు.

"అందులో డబ్బుందా?" మరొక ఆసామీ కుతూహలంకొద్దీ ప్రశ్నించాడు.

"లేదండీ."

ఆ ఆసామీ ముఖం కొంచెం వన్నె తగ్గింది. అందులో చాలా డబ్బుండి ఉంటే గద ఆ సంఘటన ఆసక్తికరంగా ఉండేది! ఉత్సాహంకొద్దీ గొలుసులాగి, రైలాపి టి. సి. గార్డులతో కాస్త వివాదపడి తనేమిటో, తన చొరవ ఏమిటో, తన వాగ్ధాటి ఏమిటో చుట్టుపక్కలవాళ్ళు అద్భుతపడుతూ తెలుసుకునేది!

"పాంట్, షర్టు ఉన్నాయండీ,, అన్నాడు బాగ్ పోగొట్టుకున్న యువకుడు.

'.అంతేగద. ఈ మాత్రానికి గొలుసు లాగడ మెందుకలెండి."

"అయ్యో" సానుభూతి ప్రదర్శించారు చుట్టుపక్కల పాసెంజర్లు.

"అయినా అంత అజాగ్రత్త ఏమిటండీ ? వీరు చూడండి—రైలెక్కినప్పటినించీ చూస్తున్నా—పాపం ఆ బాగ్ అలా చంటిబిడ్డని పట్టుకొన్నట్టు పట్టుకునే ఉన్నారు. మరి జాగ్రత్తంటే అదీ !"

ఒక వ్యక్తి ప్రశంసాపాత్రంగా నావైపూ, నా బాగ్‌వైపూ చూస్తూ అన్నాడు. నాకు చిరుగర్వం కలిగింది. కొంచెం దర్పంగా అతనివైపు చిరునవ్వు ఒలికించి చూశాను.

"ఏం టికెట్ ? టూర్ టికెట్ కాదు గద ?" అప్పటిదాకా ఊరికే ఇదంతా గుడ్లప్పగించి చూస్తూ కూర్చున్న కుర్రాడు ఒకడు - విద్యార్థిలా ఉన్నాడు. అకస్మాత్తుగా ఆసక్తి కలిగినట్టు అతనివైపు చూస్తూ అన్నాడు.

"టూర్ టికెట్టేనండీ. అందుకే భద్రంగా బాగ్‌లో పెట్టుకున్నాను" జాలిగొల్పే హీనస్వరంతో అన్నాడా యువకుడు.

"థ్రిల్లింగ్" ఆ విద్యార్థిలా ఉన్న కుర్రాడు అరిచాడు.

అందరూ ఆశ్చర్యంగా 'అతని కేమైనా పిచ్చా!' అన్నట్టు అతనివైపుచూశారు. ఆ కుర్రాడు నాలుక కరచుకొన్నాడు. "సారీ మనం ఏదైనా పారేసుకుంటే, అది పోయిందని తెలిసిన క్షణాన ఏదో థ్రిల్ కలుగుతుందండీ - ఒక సిట్యుయేషన్ - ఒక విశేష పరిస్థితి అన్నమాట - ఏర్పడుతుంది గదా ! అప్పుడు అందులోంచి ఏలా బయటపడాలా అని మనసుశక్తులన్నీ కూడగట్టుకొని ఆలోచిస్తుంది. మనిషి డైనమిక్‌గా — మాంచి చైతన్యవంతుడిగా మారిపోతాడు. టికెట్ పోయింది, టి. టి. ఐ. వస్తాడు, ఏం చెయ్యాలి ! చూడండి—జీవితం అంటే ఇలాంటి సిట్యుయేషన్లని ఎదుర్కోటమే-ఏం చేస్తాము మరి !" గుక్క తిప్పుకోకుండా అనేశాడు ఆ కుర్రాడు.

పక్కన ఉన్నవాళ్ళంతా ఆ కుర్రాడి వైపు వింతగా చూశారు. పోగొట్టుకున్న యువకుడు మాత్రం అతనివైపు కోపంగా చూశాడు. నేను మాత్రం ఆ కుర్రాడిని ప్రశంసాపూర్వంగా తదేకంగా చూశాను. అతను "థ్రిల్లింగ్" అని అరవగానే నాలో ఏదో బాటరీ ఛార్జిచేసినట్లయింది. నాలో ఏ మూలో అలాంటి థ్రిల్‌కోసం అజ్ఞాతంగా ఆవేదన కలిగిందని అస్పష్టంగా గుర్తించాను. "బాగ్ ఒకవేళపోతే !" అనే ఆలోచన నాకూ చాలాసార్లు కలిగింది నిజానికి. పరిస్థితి ఊహించుకోటమూ కొంత జరిగింది.

"అదేమిటండీ, గొలుసులాగి, పోలీస్ రిపోర్టివ్వాల్సిందే. ఎంత పోతేమాత్రం, ఏం పోతేమాత్రం చూస్తూ ఊరుకుంటారా!" ఇంకొక వ్యక్తి తన అభిప్రాయం వెలి బుచ్చాడు.

"అవునండి. మనం ఊరుకొంటే దొంగతనాన్ని ప్రోత్సహించినట్టే. రైలాపి రిపోర్టివ్వాలిసిందే!" ఇంకో వ్యక్తి, ఇందాకటి వ్యక్తిని బలపరిచాడు.

రైలు ఏ కారణంవల్లనైనాసరే, ఆఖరికి రైలుకింద ఎవరైనా పడ్డాకూడా, ఆగటం సహించలేనంత విసుగు ప్రదర్శిస్తూ పెద్దమనిషి ఒకాయన కలగచేసుకున్నాడు.

"ఆఁ....పోలీస్ రిపోర్టిస్తేమాత్రం అదేమైనా మళ్ళీ దొరుకుతుందా ? పైగా 250 రూపాయలు గొలుసు లాగినందుకు జరిమానా వేసినా వెయ్యొచ్చు. పోయిందిపోగా ఇదో నష్టం కూడా ఎందుకండీ."

ఆ యువకుడు కొంచెం సందిగ్ధావస్థలో పడి అన్నాడు "ప్చ్, కొత్తదండీ, ఈ మధ్యే బొంబేలో కొన్నాను. పాంట్, షర్ట్ కూడా కొత్తవే."

"పోనీ వచ్చే స్టేషన్లో రిపోర్టివ్వండి."

"ఈ రైళ్ళలో రద్దీ తగ్గనంతకాలం ఇంతేనండీ. ఎవరికో ఎప్పుడూ ఏదో పోతూనే ఉంటుంది."

రైళ్ళలో అధిక ప్రయాణానుభవం తనకిచ్చిన సందేశం అంతేనన్నట్టుగా అన్నాడు ఒక తల నెరసిన మధ్యతరగతి మనిషి.

ఆమాట ఆయన అనటంతోనే చప్పున నేను నా చేతిలో భద్రంగా ఉన్న నా హాండ్‌బాగ్‌వైపు చూసుకొన్నాను. అది సర్వీస్ చేసి చేసి అలసిపోయి బక్కచిక్కిపోయిన రిటైర్డ్ ఎల్.డి.సి. లా ఉంటే ఉండుగాక ! డొక్కలంటుకుపోయి అందరి వైపూ దీనంగా చూసే ముష్టివాడిలా ఉంటే ఉండుగాక ! దాన్ని పురావస్తుశాలకి ఉచితంగా పంపవలసిందిగా పలువురు మిత్రులు పదేపదే అయాచిత సలహాయిస్తే ఇచ్చి ఉండవచ్చుగాక ! ఆ బాగ్ నాకు బహిఃప్రాణం. ప్రయాణాల్లో అది నాకు తోడునీడ. అదెక్కడ ఎవరు కొట్టేస్తారో అని విడవకుండా, క్షణంకూడా సీటుమీద పెట్టటానికి సాహసించకుండా, చేత్తో భద్రంగా పట్టుకోవటమేగాక, దానిని ఎల్లప్పుడూ నేనొక కంట కనిపెడుతూనే ఉంటాను. అది నా అలవాటు.

"అందులో టికెట్‌కూడా ఉందండీ" ఆకస్మాత్తుగా గుర్తుకువచ్చినట్టు అన్నాడా యువకుడు.

అయితే మనసులో అలాంటి ఊహలకి వ్యతిరేకంగా నేనే ఓ గట్టి హెచ్చరిక ఇచ్చు కుని అంతటితో ఆ ఆలోచన కట్టిపెట్టేవాడిని.

"ఇప్పుడు కర్తవ్యం ఏమిటి ? ఊరికే ఊకదంపు దేనికి ?" అన్నాడో కార్యాచరణశీలి.

"ఏముందీ, వచ్చే స్టేషన్లో రిపోర్టిస్తే సరి" ఒక సలహా.

"పోనీ టికెట్ నంబర్ నోటు చేసుకున్నారా ?"

"లేదండీ."

ఓ తోటి ప్రయాణీకుడికి ఒళ్ళుమండుకొచ్చింది.

"అదేమిటండీ! అలాంటప్పుడు అంత అజాగ్రత్తగా ఎలా ఉన్నారు ?" మంద లింపుగా అన్నాడు.

"ఆఁ మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా పోయేవి పోతూనే ఉంటాయి. అన్నప్పు డల్లా మన టైం కాదు."

ఇంకొకాయన ఆ యువకుడిని ఓదారుస్తున్నట్టు అన్నాడు.

"మీరన్నది నిజమే నండోయ్. వారం రోజులకిందే మద్రాసులో అయిదొందలు పెట్టి వాచీ కొన్నానండీ. ట్రయిన్లో వస్తూ, బాత్‌రూంలో ముఖం కడుక్కుందామని తీసి స్టాండ్‌మీద పెట్టి మళ్ళీ తీసుకోటం మర్చిపోయానండీ. ఎంత, రెండు నిమిషాల వ్యవధి ఉందో లేదో, చప్పున గుర్తుకొచ్చి మళ్ళీ వెళ్ళి చూస్తే ఏముంది ?"

మరో ప్రయాణీకుడు తన అనుభవం వివరించాడు.

"పోయిందా" కుతూహలంగా అడిగాడొకాయన !

"పోకుండా ఇంకా అక్కడుంటుందటండీ !"

పెదవి విరిచాడు ఆ ఆసామీ.

"ఏం చేశారు అప్పుడు?" విద్యార్థిలా ఉన్న ఆ కుర్రాడు కళ్ళు పెద్దవి చేసి ఆయనవైపు చూస్తూ అడిగాడు.

"ఏం చేస్తాను ? అయిదొందల వాచీ కృష్ణార్పణం" అనుకొని తిలోదకా లిచ్చాను.

ఆ కుర్రాడు నిరుత్సాహంగా ముఖం పెట్టాడు.

ఈ సంభాషణ వింటున్న ఇంకో ప్రయాణీకుడు వెంటనే ముఖంలో ఎంతో బాధ వ్యక్తపరుస్తూ—

"అంతేనండి మరి. నా పట్టుకు నేనేం చేశాను. మా మేనల్లుడికి పెళ్ళి ప్రజంట్ ఇద్దామని ఫారిన్‌లో ఓ మిత్రుడుంటే అతనిద్వారా ట్రాన్సిస్టర్-స్మగుల్డు కాదండోయ్— నా మిత్రుడిద్వారా పేమెంట్ ఎరేంజి చేసి - తెప్పించానండి. పెళ్ళికి వెడుతూ బస్‌లో మర్చిపోయాను. తరువాత గుర్తుకొచ్చి వెనక్కి బస్‌స్టాండ్‌కి పరిగెత్తితే బస్సక్కడే ఉందిగాని ట్రాన్సిస్టర్‌కి రెక్కలొచ్చాయి."

"ఏం చేశారు మరి ?" ఆ కుర్రాడడిగాడు.

"ఏమిటి చేసేది ! పోయింది మంది కాదని ఓ దణ్ణం పెట్టి ఊరుకున్నాను.

"అంతే ?" అన్నాడు కుర్రాడు.

"చివరకి ఓ దేశీ ట్రాన్సిస్టర్ కొని ప్రజంట్ చేశాను." ఓ మెట్టు దిగినందుకు విచారిస్తూన్నట్టుగా అన్నాడాయన.

"నా టేప్‌రికార్డర్ అలాగే పోయిందండీ, టాక్సీలో మర్చిపోయా." ఇంకొకాయన పోయిన తన వస్తువును తలచుకొని, అవి వాళ్ళిద్దరి వస్తువులకంటె ఖరీదైందనుకునో, ఏమో కొంచెం దర్పంగా వాళ్ళవైపు చూస్తూ అన్నాడు.

"టాక్సీ నెంబర్ గుర్తులేదా ?" ఆ కుర్రా డన్నాడు.

"బాగుంది నెంబర్ చూసి టాక్సీ ఎక్కుతారటయ్యా! టాక్సీ ఖాళీగా పోతుంటే ఆపుతాం, ఎక్కుతాం, నెంబర్ చూస్తామా !" అన్నాడాయన మరింత గర్వం ఉట్టిపడేట్టు.

అకస్మాత్తుగా ఒక బొర్ర మీసాలాయనకి ఉద్రేకం వచ్చింది"వాచీలా, ట్రాన్సిస్టర్లూ, టేప్ రికార్డర్లేమిటండీ. బుద్ధి గడ్డితిని తాళం వెయ్యటం బద్ధకించి అలా హోటల్లో కాఫీ తాగొద్దామని వెళ్ళాను, వచ్చి చూస్తే ఏముంది ? అయిదు వేల రూపాయల స్కూటరు ఖాళీ."

"పోలీస్ రిపోర్టిచ్చారా !" అన్నాడా కుర్రాడు.

"ఇచ్చా పేరుకి, ఏం లాభం? పోయింది తిరిగొస్తుందా? అంతే !" చెయ్యి గాలిలో ఊపాడతను.

ఇంతవరకూ ఈ మాటలన్నీ కొంచెం దూరంలో ఉండి వింటూ మౌనంగా కూర్చున్న మీసాలూ, గడ్డమూ పెంచిన ఓ పాతికేళ్ళ యువకుడు హఠాత్తుగా లేచి

నిలబడ్డాడు. చెయ్యి గుండెమీద పెట్టుకున్నాడు. అతని వదనం అంతా నిరాశా మబ్బులా వ్యాపించి ఉంది. కళ్లలో మాత్రం వెలుగు తళ తళ మెరుస్తోంది. పెదవులు ఒణుకుతున్నాయి.

"ఏమిటండీ, ఈ అవాకానీ కబుర్లు" అన్నాడతను.

కాలం మారింది. కాలంతోపాటు జాతీయాలూ మారాలి. "ఏడుపైసల కబుర్లనండి" ఓ వ్యక్తి అతని జోక్యానికి చిరాకునో, లేక తన హాస్యధోరణినో వ్యక్తపరుస్తూ అన్నాడు. కాని ఆ యువకుడు కోపం తెచ్చుకోనూ లేదు, నవ్వనూ లేదు. గంభీరంగా అన్నాడు.

"అసలు పోగొట్టుకోటం అంటే మీకు తెలుసా? బాగ్‌లూ, వాచీలూ, ట్రాన్సిస్టర్లూ, టేప్ రికార్డర్లూ, స్కూటర్లేనా మనుషులు పోగొట్టుకొనేది! కాస్త ఏమరుపాటుగా ఉండి నేను ప్రేమించిన అమ్మాయినే పోగొట్టుకొన్నా," ఆ యువకుడు ఉస్సురని గుండెని చేత్తో అదిమి యథాస్థానంలో కూలబడిపోయాడు. క్షణం నిశ్శబ్దం ఆవరించింది.

"రియల్లీ త్రిల్లింగ్" అన్నాడు విద్యార్థిలా ఉన్న కుర్రాడు. అందరూ ఆ యువకుడి వైపు కొంచెం ఆశ్చర్యంగా, కొంచెం జాలిగా చూశారు.

"అదంటీ! నిజంగా ఏదైనా పోగొట్టుకోట మంటే?" గుసగుసలు వినిపించసాగాయి.

"అప్పుడేం చేశారు" అన్నాడు ఆ కుర్రాడు.

"గడ్డం పెంచాను" అన్నాడా యువకుడు కొంచెం కోపంగా-కొంచెంవిరక్తిగా.

'మేన్లీ!' అన్నాడా కుర్రాడు కంచు కంఠంతో.

నాకు మాత్రం నర నరాల్లో విద్యుత్తు ప్రవహించింది. వండర్‌ఫుల్. ఆరాధనాపూర్వకంగా అతనివైపు చూశాను. ఓహోహో! ఇలాటి అనుభవాలే జీవితం! నా చూపు అప్రయత్నంగా నా బాగ్‌మీదకి ప్రసరించింది. దాన్ని చూస్తుంటే కోపమూ, విసుగూ కలిగాయి. ఎవరికీ దీనిమీద దృష్టి పడదేం! పోనీ బాగ్ లేకపోతే సైకిల్, ఇరవై ఏళ్ల వయసుది. తాళం వెయ్యకుండా నడిరోడ్డుమీద ఒదిలినా ఎవడూ దాని జోలికి పోలేదింతవరకు. అకస్మాత్తుగా నాలో ఏదో చైతన్యం కలిగింది. నేను అచేతనంలో ఏదో ఇన్నాళ్లూ అన్వేషిస్తున్నట్టు, ఆ అన్వేషించేదేమిటో అకస్మాత్తుగా

తెలిసిపోయినట్టు అనుభూతి కలిగింది. ఏదో ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నట్టు అని పించింది. ఈ సారి ముచ్చటైన ఖరీదైన జిప్‌బాగ్ కొని రైలెక్కాలి. ఖరీదైన ట్రాన్సిస్టర్, టేప్ రికార్డర్, స్కూటర్! ఓహో! వస్తుంది. ఆ రోజు వస్తూంది! నేను ఎదురుచూసే అనుభవం ఊపిరాడ నివ్వటంలేదు. కాని-కాని-ఎలా? ఆ వస్తువుల్ని కొనడం ఎలా?

"ఏమండోయ్ బాగ్ జాగ్రత్త" అనే హెచ్చరిక వినిపించి ఉలిక్కిపడిచూశాను. నా ఆలోచనల్లో బాగ్‌ను అప్రయత్నంగా వదిలాను కాబోలు. అది కిందపడి ఉంది. జీర్ణావస్థలో ఉన్న ఆ బాగ్ ఓడిపోయిన పోటీదారులా తల వంచుకుని దీనంగా నా వైపు చూసింది. చేతుల్లోకి తీసుకున్నాను, ఏదో నిరాశ ఆవరించింది. ఛీ! ఏమిటిలా అధైర్యపడుతున్నాను! ఆశావాదం నా జన్మ హక్కు. కాస్త ఓపిక పట్టి వేచి ఉండాలి. అంతే, నాకూ కలిగి తీరుతుంది ఎప్పుడో ఆ థ్రిల్.

( ప్రభవ ఏప్రిల్ 1978 )